
వికారాబాద్ కలెక్టరేట్



- వికారాబాద్ జిల్లాలో తొమ్మిదిన్నరేండ్లలో కనీవినీ ఎరుగని అభివృద్ధి
- మణిహారంగా మారనున్న మొబిలిటీ వ్యాలీ
- మంజూరైన ప్రభుత్వ మెడికల్ కాలేజీ, నర్సింగ్, ఆయుష్ కాలేజీలు
- మాతాశిశు ఆసుపత్రితోపాటు బస్తీ, పల్లె దవాఖానలతో పేదలకు చేరువైన నాణ్యమైన వైద్యసేవలు
- అందుబాటులోకి ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్
- పల్లెప్రగతితో మారిన గ్రామాల రూపురేఖలు
- పరిశ్రమల ఏర్పాటుతో రూ.1530 కోట్ల పెట్టుబడులు
- జిన్‌గుర్తి, అర్కతలలో ఫుడ్ ఇండస్ట్రియల్ పార్కులు
- రూ.1500 కోట్లతో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి, వంతెనల నిర్మాణం
- నాలుగు నియోజకవర్గాల్లో బీసీ, గిరిజన భవన్‌లు

# ప్రగతిపథాన..

జిల్లా ప్రగతిపథంలో దూసుకుపోతున్నది. వికారాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలనే ప్రజల ఆకాంక్షను నెరవేర్చారు సీఎం కేసీఆర్. జిల్లాగా ఆవిర్భవించిన అనంతరం పలు అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.7వేల కోట్ల వరకు నిధులను విడుదల చేసింది. ప్రధానంగా జిల్లాలోని మోమిన్‌పేటలో రూ.50వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా మొబిలిటీ వ్యాలీని ప్రభుత్వం టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నది. మరోవైపు పేదలకు సత్వర వైద్యం అందించాలనే ఉద్దేశంతో జిల్లాకు ప్రభుత్వ వైద్య కాలేజీ, ఆయుష్ ఆసుపత్రి, క్యాన్సర్ బాధితులకు పాలియేటివ్ కేర్ కేంద్రాన్ని కూడా మంజూరు చేసింది. నర్సింగ్ కాలేజీతోపాటు మాతాశిశు సంరక్షణ ఆసుపత్రితోపాటు మున్సిపాలిటీల్లో బస్తీ దవాఖానలు, గ్రామపంచాయతీల్లో పల్లె దవాఖానలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. తొమ్మిదిన్నరేండ్లలో జిల్లాలోని తాండూరులో కాలుష్యాన్ని తగ్గించేందుకు బైపాస్ రోడ్డును మంజూరు చేయడంతోపాటు ప్రతి గ్రామంలో రోడ్లను నిర్మించింది. లింకు రోడ్లను ఏర్పాటు చేసింది. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడంతోపాటు మున్సిపాలిటీల సంఖ్యను పెంచి సుందరంగా తీర్చిదిద్దింది. మరోవైపు జిల్లాలోని జిన్‌గుర్తి, అర్కతలలో ఫుడ్ ఇండస్ట్రియల్ పార్కులను ప్రభుత్వం మంజూరు చేయగా, ఈ ఏడాది అందుబాటులోకి రానున్నాయి. సబ్బండ వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు బీసీ భవన్, గిరిజన భవన్‌లను కూడా మంజూరు చేసింది. - వికారాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ)

## రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులు

జిల్లా ఏర్పాటైన అనంతరం జిల్లాలోని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి రూ.1500 కోట్లపైగా ప్రభుత్వం నిధులిచ్చింది. నాలుగు లేన్ల రోడ్లతోపాటు రహదారుల మరమ్మతులు, రెండు లేన్ల రోడ్డును నాలుగు లేన్ల రోడ్డుకు పెంచడం, మండలాల నుంచి జిల్లా కేంద్రాలకు రోడ్డు, సింగిల్ లేన్-రెండు లేన్ల రోడ్లకు, బ్రిడ్జిల నిర్మాణానికి, రోడ్డు ఓవర్ బ్రిడ్జి, రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులను విడుదల చేసింది. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు ఆర్అండ్‌బీ రహదారుల నిర్మాణాలు, మరమ్మతులకు రూ.800 కోట్లకు పైగా నిధులను మంజూరు చేసింది. పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి మరో రూ.600 కోట్లకుపైగా ప్రభుత్వం నిధులిచ్చింది. రోడ్ల మరమ్మతులకు ఇప్పటివరకు రూ.250 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయి.

## ప్రజలకు చేరువైన పాలన

కొత్త జిల్లాల ఏర్పాటుతో పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రతి జిల్లాకు ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌లను నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు. రూ.60 కోట్లతో 33 ఎకరాల్లో నూతన కలెక్టరేట్‌ను నిర్మించారు. అన్ని శాఖలు అక్కడినుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

## పేదలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు

జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు చేయగా.. శాశ్వత మెడికల్ కాలేజీ నిర్మాణం, ఆసుపత్రి అప్‌గ్రేడింగ్, పరికరాలు, ఫర్నిచర్ కొనుగోలుకు రూ.235 కోట్లను ప్రభుత్వం నిధులిచ్చింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలంటే 380 పడకల అనుబంధ ఆసుపత్రిని ముందుగా అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంటుంది. అందుకే వికారాబాద్‌లో 100 పడకల సివిల్ ఆసుపత్రిని 380 పడకలతో బోధనాసుపత్రిని రూ.30 కోట్ల నిధులతో నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ, ఆయుష్ ఆసుపత్రిని మంజూరు చేయగా, తాండూరులో కాలేజీ భవన నిర్మాణానికి, వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆయుష్ ఆసుపత్రి భవన నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపనలు పూర్తికాగా పనులు కొనసాగుతున్నాయి.

## కొత్త మున్సిపాలిటీలు.. గ్రామపంచాయతీలు

పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా జిల్లాలో వికారాబాద్, తాండూరుతోపాటు పరిగి, కొడంగల్‌ను కొత్త మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేశారు. పెద్ద మండలంగా ఉన్న బంట్వారం మండలాన్ని విభజించి నూతనంగా కోట్‌పల్లి మండలాన్ని ఏర్పాటు చేశారు. తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చారు. గతంలో జిల్లాలో 367 గ్రామపంచాయతీలుండగా.. తండాలతో పాటు మరికొన్ని అనుబంధ గ్రామాలను కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య 566కు పెరిగింది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో రోడ్లను అభివృద్ధిలోకి తీసుకురావడంతోపాటు మురుగు కాల్వల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, పార్కుల నిర్మాణం, అండర్ డ్రైనేజీ నిర్మాణం, బీటీ రోడ్ల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ పనులు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డుల నిర్మాణం, ప్రధాన కూడళ్ల అభివృద్ధి, కొత్త మున్సిపాలిటీల్లో మున్సిపాలిటీ భవనాల నిర్మించేందుకు అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నెలకు జిల్లాలోని గ్రామ పంచాయతీలన్నింటికీ కలిపి రూ.10 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చిస్తున్నది.


మోమిన్‌పేట మండలం వెల్చల్ గ్రామంలో నిర్మించిన బ్రిడ్జి


మెడికల్ కాలేజీలోని లెక్చర్ హాల్

## వేల మంది నిరుద్యోగులకు ఉపాధి

మంత్రి కేటీఆర్ సహకారంతో మోమిన్‌పేట మండలం ఎన్కతలలో 1200 ఎకరాల్లో ఏర్పాటు చేసే మొబిలిటీ వ్యాలీ జిల్లాకు మణిహారంగా మారనుంది. ప్రత్యేక వికారాబాద్ జిల్లాగా ఏర్పాటైన అనంతరం జిల్లాకు భారీ ప్రాజెక్టు రావడంపై జిల్లా ప్రజానీకం సంతోషం వ్యక్తం చేస్తున్నది. ఎలక్ట్రిక్ వాహనాలతోపాటు వాహనాల విడి భాగాల తయారీ యూనిట్లతో కూడిన మొబిలిటీ వ్యాలీ ప్రాజెక్టుతో జిల్లా రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఈ ప్రాజెక్టుతో మోమిన్‌పేట, నవాబుపేట మండలాలతోపాటు వికారాబాద్ జిల్లా కేంద్రం వరకు అభివృద్ధి విస్తరించనుంది. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చినట్లయితే వికారాబాద్ జిల్లా కేంద్రంతోపాటు ముంబై జాతీయ రహదారికి వెళ్లే సదాశివపేట్, జిల్లాలోని మర్పల్లి వరకు భవిష్యత్తులో అనేక ప్రాజెక్టులు వచ్చే అవకాశాలున్నాయి. జిల్లాలోని వేల మంది నిరుద్యోగులకు ఉపాధి లభించనుంది.


బుగ్గ-మున్నూరు రోడ్డు


ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వికారాబాద్


వికారాబాద్-తాండూరు మధ్య వేసిన రోడ్డు

## పరిశ్రమలకు పెద్దఎత్తున పెట్టుబడులు

గత తొమ్మిదిన్నరేండ్లలో జిల్లాలో పరిశ్రమల నిమిత్తం రూ.1530 కోట్ల పెట్టుబడులు రాగా.. సోలార్, పవన విద్యుత్తు పరిశ్రమలతో రూ.1000 కోట్లు., మిగతా చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుతో రూ.500 కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయి. ప్రధానంగా పవర్, ఫార్మా రీసైక్లింగ్, ఐరన్, ప్లాస్టిక్, గ్లాస్, మైనింగ్, పర్యాటక రంగం, విత్తనోత్పత్తి పరిశ్రమలను ఏర్పాటు చేశారు. నవాబుపేట మండలం అర్కతల, తాండూరు మండలం జిన్‌గుర్తిలో ఫుడ్ ఇండస్ట్రియల్ పార్కులను మంజూరు చేయగా, టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జిల్లాలో చిన్న, మధ్య, భారీ తరహా పరిశ్రమలతో సుమారు 10 వేల మందికి ఉపాధి లభించింది. కొత్తగా ఏర్పాటు కానున్న ఆహార ఇండస్ట్రియల్ పార్కులకు సంబంధించిన పరిశ్రమలతో మరో 15-20 వేల మందికి ఉపాధి లభించనుంది.